
గురువారం 16 అక్టోబర్ 2025 5

పార్వతీపురం మన్యం



నేడు గురుకులం పునఃప్రారంభం

ప్రజాశక్తి - కురుపాం

ఇటీవల మండల కేంద్రమైన కురుపాంలోని గురుకుల పాఠశాల గురువారం పున:ప్రారంభం కానుంది. ఈ గురుకుల పాఠశాలలో పచ్చకామెర్లు వ్యాధి బారిన పడి ఇద్దరు విద్యార్థులు మృతిచెందిన విషయం తెలిసిందే. సుమారు 200 మంది విద్యార్థులు పచ్చకామెర్లు బారినపడి జిల్లా కేంద్రాస్పత్రిలో, కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ కొందరు డిశ్చార్జి అయ్యారు. ఈ ఘటన రాష్ట్రంలోనే సంచలనమైంది. దీంతో కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి పాఠశాలకు వారం రోజులపాటు సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం నుంచి పాఠశాల పున:ప్రారంభించాలని సబ్ కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినట్లు ప్రిన్సిపల్ బి.విజయలక్ష్మి తెలిపారు.

మన్యంలో మరణ మృదంగం

మంత్రి ఇలాకాలో పక్షంలో నలుగురు విద్యార్థుల మృతి ● పిట్టల్లా రాలిపోతున్నా పట్టించుకోని ప్రభుత్వం

జిల్లాలో గిరిజన విద్యార్థుల మరణ మృదంగం కొనసాగుతోంది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కురుపాం గురుకుల పాఠశాల విద్యార్థినుల అనారోగ్య సమస్య, ఇద్దరు మరణానికి దారి తీసిన సంఘటన మరువక ముందే సాక్షాత్తూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి సొంత నియోజకవర్గంలోనూ మరణాలు సంభవిస్తున్నాయి. విద్యార్థుల అనారోగ్యం, పలు రోగాల బారిన పడడం వంటి పరిణామాలకు మూల కారణాలను ప్రభుత్వం నిర్ధారించిన తర్వాత వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోకుండా ఉదాసీనంగా వ్యవహరించడం వివాదాస్పదమవుతోంది.



చిన్నారి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు

ప్రజాశక్తి-పార్వతీపురం

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంతవరకు జిల్లాలో సుమారు 17 మంది గిరిజన విద్యార్థులు మృత్యువాత పడ్డారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, గురుకులాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేని కారణంగా విద్యార్థులు తరచూ అనారోగ్యం బారిన పడటం, ఆలస్యంగా వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టడం వంటి చర్యల వల్ల మరణాల వరకు పరిస్థితులు వెళుతున్నాయి. ఏజెన్సీ మండలాల్లో ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో, గురుకులాల్లో రక్షిత తాగునీటి సరఫరా జరగడం లేదు. గత ప్రభుత్వం హయాంలో మంజూరైన వాటర్ ప్లాంట్లు పని చేయకపోవడంతో ప్రస్తుత ప్రభుత్వం వాటిని మరమ్మతు చేయించలేదు. దాదాపు అన్ని ఆశ్రమ పాఠశాలల్లో, గురుకులాల్లోని వాటర్ ప్లాంట్లన్నీ మూలకు చేరాయి. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తోంది. ఇంతవరకు వాటికి మరమ్మతులైనా చేయాలి. లేదా కొత్త వాటర్ ప్లాంట్‌లైనా మంజూరు చేయాలి. అలాంటి చర్యలు తీసుకోకుండా అధికారుల మొక్కుబడి సందర్శనలు, పరిశీలనలతో కాలయాపన చేయడం వల్ల కురుపాం గురుకుల పాఠశాలలో పచ్చకామెర్లు విజృంభించాయి. దాదాపు అన్ని పాఠశాలల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నా ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడంపై గిరిజన సంఘాలు భగ్గుమంటున్నాయి. పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోనే కాదు సీతంపేట ఐటిడిఎ పరిధిలోనూ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, గురుకులాల్లోను విద్యార్థులు మరణిస్తున్నాయి. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఎఎన్‌ఎంల నియామకం చేపడతామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి చెప్పి ఏడాదిన్నర కావస్తోంది. ఇంతవరకు ఆ హామీ కార్యరూపం దాల్చలేదు.

మంత్రి ఇలాకాలో పక్షంలో నలుగురు మృతి

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే కేవలం పక్షం రోజుల వ్యవధిలో నలుగురు గిరిజన విద్యార్థులు మరణించారు. సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల్లోని కెజిబివి, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు అనారోగ్యంతో మృతి చెందారు. దసరా సెలవుల తర్వాత నలుగురు విద్యార్థులు అనారోగ్యానికి గురై మరణించడం చర్చనీయాంశమవుతోంది. మక్కువ మండలంలోని నంద గ్రామానికి చెందిన బిడ్డిక కీర్తన పాచిపెంట కెజిబివిలో ఇంటర్మీడియట్ చదువుతూ అనారోగ్యానికి గురైంది. కొద్దిరోజుల క్రితం కీర్తన మరణించింది. పాచిపెంట మండలంలోని మూలవలస గ్రామానికి చెందిన మూడో తరగతి విద్యార్థిని కొట్టిశ శాంత జ్వరంతో మరణించింది. సాలూరు మండలంలోని మామిడిపల్లి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థిని తాడంగి పల్లవి దసరా సెలవులకు ఇంటికి వెళ్లి అనారోగ్యానికి గురైంది. బొబ్బిలి మండలంలోని కృపావలస గ్రామానికి చెందిన పల్లవిని తల్లిదండ్రులు సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించి చికిత్స అందించారు. అప్పటికీ నయం కాకపోవడంతో విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ కూడా మెరుగుపడకపోవడంతో విశాఖపట్నం కెజిహెచ్‌కి తరలించారు. ఈ నెల 12న పల్లవి కెజిహెచ్‌లోనే మృతి చెందింది.

మక్కువ మండలంలోని ఎర్రసామంతవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థి తాడంగి చిన్నారి బుధవారం వేకువజామున మరణించాడు. చిన్నారి ఆరోగ్యం బాగోలేదని పాఠశాల సిబ్బంది ఆలస్యంగా తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వారు సాలూరు ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ కూడా పరిస్థితి మెరుగు పడకపోవడంతో విజయనగరం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఇంకా మెరుగైన చికిత్స కోసం బుధవారం వేకువజామున విశాఖపట్నం కెజిహెచ్‌కి తరలిస్తుండగా చిన్నారి మార్గం మధ్యలో మృతి చెందాడు. మక్కువ మండలంలోని పనసబద్ర పంచాయతీ మూలవలస గ్రామానికి చెందిన విద్యార్థి చిన్నారి మరణంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

17 మంది విద్యార్థులు మరణించినా స్పందించరా?

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో టిడిపి కూటమి ప్రభుత్వ హయాంలో ఇంతవరకు 17మంది గిరిజన విద్యార్థులు మరణించారు. అయినా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదు. ఎర్రసామంతవలస ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న తాడంగి చిన్నారి కూడా పచ్చకామెర్లతో మరణించాడు. విద్యార్థి చిన్నారికి ఒంట్లో బాగులేదని ఇంటికి తీసుకెళ్లాలని ఉపాధ్యాయులు ఈనెల 13న ఫోన్ చేశారు. జబ్బు బాగా ముదిరిన తర్వాత పాఠశాల ఉపాధ్యాయులు సమాచారం ఇవ్వడంతో చిన్నారి ఆరోగ్య పరిస్థితి చే జారింది. ఇప్పటికైనా ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్‌ఎంల నియామకం చేపట్టి, మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలి.

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అఖిల్

నిర్లక్ష్యం తగదు

గిరిజన విద్యార్థుల ప్రాణాల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఇంత నిర్లక్ష్యం తగదని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకుకలెక్టర్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు మూడో రోజు బుధవారం కొనసాగాయి. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ సోమ, బుధవారాల్లో మరో ఇద్దరు విద్యార్థులు అనారోగ్యానికి గురై మృతి చెందారని వివరించారు. ఇలా గిరిజన విద్యార్థుల మరణాలు సంభవిస్తున్నా కూటమి ప్రభుత్వం చాలా నిర్లక్ష్యంగా ఉండడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే గతంలో పనిచేసిన ఎఎన్‌ఎంలను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. డైట్ ఛార్జీలు పెంచి పౌష్టికాహారం అందించాలని, సురక్షితమైన తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. దీక్షలో కాంగ్రెస్ పార్టీ పార్వతీపురం మండల అధ్యక్షులు తీల్ల గౌరీ శంకర్ రావు, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పి.సంగం, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర కమిటీ సభ్యులు కోలక మల్లేష్, గిరిజన నిరుద్యోగ సంక్షేమ సంఘం నాయకులు చందు, తదితరులు పాల్గొన్నారు.

రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలి

సిపిఎం డిమాండ్



విద్యార్థి కుటుంబాన్ని పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

మక్కువ : మన్యం జిల్లాలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు వరుస మరణాలతో మన్యం వణికిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం, పాలకులు చలించని పరిస్థితి నెలకొందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్‌వై నాయుడు అన్నారు. అనారోగ్యంతో బుధవారం ఎర్ర సామంతవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఆరవ తరగతి విద్యార్థి తాడంగి చిన్నారి మృతి చెందడంతో ఆమె సొంత గ్రామం మూలవలసకు వెళ్లి సిపిఎం ప్రతినిధి బృందం చిన్నారి తల్లిదండ్రులు ముగిరి, కాంతమ్మలను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ మన్యం జిల్లా పరిధిలో ఆశ్రమ పాఠశాలలో నేటి వరకు మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ.50 లక్షల నష్టపరిహారం ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనారోగ్యాలతో హాస్పిటల్లో ఉన్న విద్యార్థులకు ఖర్చుల నిమిత్తం రూ.50వేలు చెల్లించి, పూర్తిగా ఆరోగ్యం మెరుగు పడే వరకూ ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కొండ గౌరె ఆనంద్, మండల గౌరమ్మ, భాస్కరరావు పాల్గొన్నారు.

మరణాలకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, గురుకులాల్లో విద్యార్థుల మరణానికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు లేని కారణంగానే విద్యార్థులు మరణిస్తున్నారు. పాఠశాలల్లో ఉన్న ఆర్వో వాటర్ ప్లాంట్లు పని చేయక పోవడం వల్లనే పచ్చకామెర్లు బారిన పడి విద్యార్థులు మరణిస్తున్నారు. పాఠశాలల్లో ఎఎన్‌ఎంలను వెంటనే నియమించాలి.

- గిరిజన విద్యార్థి సంఘం

విద్యార్థులకు రక్షితనీరు అందేలా చూస్తాం

గిరిజన సంక్షేమ శాఖ డిడి

మక్కువ : గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న వసతి గృహాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 90 కోట్లు మంజూరు చేసిందని, విద్యార్థులందరికీ రక్షిత మంచినీరు అందేలా చూస్తామని గిరిజన సంక్షేమ శాఖ డిడి విజయశాంతి తెలిపారు. బుధవారం ఎర్ర సామంతవలస ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న తాడంగి చిన్నారి(11) మృతిచెందడంతో మూలవలస గ్రామానికి వెళ్లి ఆ విద్యార్థి మృతదేహాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ్రమ వసతి గృహాలలో తరచూ విద్యార్థులు అనారోగ్యం బారిన పడి మరణించడం బాధాకరమన్నారు. వసతి గృహాల్లో మరమ్మతుకు గురైన మినరల్ వాటర్ ప్లాంట్లను మరమ్మతులు చేపడతామన్నారు. విద్యార్థులందరికీ రక్షిత నీరందేలా చూస్తామని తెలిపారు. వసతి గృహాల్లో ఉన్న సమస్యలపై సమగ్ర అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని తెలిపారు.

విద్యార్థుల మరణాలు ప్రభుత్వ నిర్లక్ష్యమే

గిరిజన ఆశ్రమ వసతి గృహాలలో చదువుతున్న ఆదివాసి బిడ్డలు మరణించడం ముమ్మాటికి ప్రభుత్వం నిర్లక్ష్యమేనని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.వర్మ అన్నారు. మూలవలస గ్రామానికి వచ్చిన గిరిజన సంక్షేమ శాఖ అధికారుల ఎదుట ఆయన బుధవారం నిరసన తెలిపారు.

హైడ్రోపవర్ ప్రాజెక్టు అనుమతులను

రద్దు చేయాలని నిరసన



నిరసన ర్యాలీ చేపడుతున్న పోరాట కమిటీ నాయకులు, గిరిజనులు

ప్రజాశక్తి-పాచిపెంట

హైడ్రోపవర్ ప్రాజెక్టు అనుమతులను వెంటనే రద్దు చేయాలని బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద హైడ్రోపవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. తొలుత స్థానిక గాంధీ బొమ్మ వద్ద నుంచి తహశీల్దార్ కార్యాలయం వద్దకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు సీదరపు అప్పారావు మాట్లాడుతూ గిరిజనుల అనుమతి లేకుండా డ్రోన్లు పెట్టి సర్వేలు చేసి, రాళ్లు పాతడం చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన నవయుగ, అదాని హైడ్రో పవర్ ప్రాజెక్టు కంపెనీలపై అట్రాసిటీ కేసులను నమోదు చేయాలని డిమాండ్‌చేశారు. పోరాడి సాధించుకున్న హక్కులను, జిఒలను కాలరాస్తూ ఆగమేఘాల మీద నవయుగ కంపెనీ కోసం జిఒ 13 విడుదల చేశారని దుయ్యబట్టారు. గిరిజన ప్రాంతంలో హైడ్రోపవర్ ప్రాజెక్టు పేరుతో ఆదివాసీలను సమాధి చేసి, ఖనిజ సంపాదన తరలించే కుట్రలో భాగంగా ఇటువంటి నియంత పద్ధతులకు ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. అనంతరం పోరాట కమిటీ నాయకులు డి.పండు, శిల్ప జన్ని రామయ్య, సన్నమ్మ, గరిసిగుడ్డి సర్పంచ్ ఆనంద్, తంగలం సర్పంచ్ పోయ్ అప్పన్న, మూటకూడు సర్పంచ్ మల్లేష్, గొట్టూరు సర్పంచ్ సింహాచలం, ఎంపిటిసి చదల రాజు మాట్లాడారు. ప్రభుత్వాలు గిరిజనుల పక్షాన నిలబడి, అటవీహక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కమిటీ కన్వీనర్ కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేసే విధంగా మంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ రవికుమార్‌కి వినతిపత్రం అందజేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు జన్ని రామయ్య, మంచాల శ్రీనివాసరావు, పీసా చట్టం ఉప ప్రెసిడెంట్ జర్నీ సుబ్రమణ్యం, శ్రీరాములు, మర్రి రాజు, ముఖి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

22న వ్యకాస జిల్లా మహాసభ

ప్రజాశక్తి-పార్వతీపురం



వ్యకాస జిల్లా మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఈ నెల 22న పార్వతీపురం కేంద్రంగా నిర్వహించే ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రెడ్డి ఈశ్వరరావు, కొల్లి గంగునాయుడు... వ్యవసాయ కార్మికులకు, రైతులకు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో మహాసభ వాల్‌పోస్టర్‌ను జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో గిరిజనులు, పేదల సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘం నిరంతరం పోరాడుతుందని తెలిపారు. పేదలు సాగు చేస్తున్న భూములకు డి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వామపక్షాల పోరాట ఫలితంగా వచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని మోడీ ప్రభుత్వం ఎత్తివేయడానికి ప్రయత్నం చేస్తుందని, అందులో భాగంగానే రెండు పూటలా పని విధానాన్ని ప్రవేశపెట్టిందని విమర్శించారు. దీన్ని వ్యవసాయ కార్మిక సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. పని ప్రదేశాల్లో టెంట్లు, మంచినీరు, మజ్జిగలు, పనిముట్లతోపాటు అత్యవసర ఆరోగ్య కిట్లు ఉంచాలని డిమాండ్‌చేశారు. గిరిజనుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను సంఘం వ్యతిరేకిస్తుందన్నారు. అటవీ హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, జిఒ నెంబర్ 3ను పునరుద్ధరించాలని డిమాండ్‌చేశారు. మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించాలని, జిల్లాలో సంచరిస్తున్న ఏనుగులను జూలకు తరలించాలని, పూర్ణపాడు-లాబేసు వంతెన, జిల్లాలో పెండింగ్ నీటి ప్రాజెక్టులను పూర్తిచేయాలని, గిరిజన ప్రాంతంలో హైడ్రో పవర్ ప్లాంట్ పనులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో గత మూడేళ్ల కాలంలో వ్యవసాయ కార్మిక సంఘం చేసిన కృషిని సమీక్షించుకొని భవిష్యత్తు కర్తవ్యాలను, కార్యక్రమాల రూపకల్పనకు పార్వతీపురంలో ఈ నెల 22న పదో జిల్లా మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభ జయప్రదం కోసం వ్యవసాయ కార్మికులు, రైతులు, మేధావులు, అభ్యుదయ వాదులు ఆర్థిక, హార్దిక సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మర్రి శ్రీను, కొల్లి సాంబమూర్తి పాల్గొన్నారు.

కొమరాడ : పార్వతీపురంలో ఈ నెల 22న జరిగే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, ప్రసాద్ కోరారు. ఈ మేరకు కొమరాడలో బుధవారం వ్యకాస జిల్లా మహాసభ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు సిఐటియు మద్దతు

ప్రజాశక్తి-పార్వతీపురం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ, జిల్లా నాయకులు

తమ సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగులు ఈ నెల 17 నుంచి చేపట్టనున్న సమ్మెకు మద్దతు తెలుపుతున్నట్లు సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి డి.రమణారావు, వై.మన్మథరావు ప్రకటించారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో వారు సమ్మెకు మద్దతుగా పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. గ్రేడ్ 2 జెఎల్‌ఎంలకు ఎపిఎస్ఇబిలో విలీనం చేయాలని, ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్మికులకు అండగా నిలబడాలని, సమ్మె జయప్రదం కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రెడ్డి వేణు, బివి రమణ, ఎన్‌వై నాయుడు, ఆర్.రాము, ఎం.ఉమామహేశ్వరి, బొంకుర సూరిబాబు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమ్మెకు మద్దతు

విద్యుత్ ఉద్యోగుల సమ్మెకు మద్దతు తెలుపుతున్నట్లు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, కోశాధికారి గొర్లి వెంకటరమణ చెప్పారు. స్థానిక విద్యుత్ కార్యాలయంలో సమ్మె వాల్‌పోస్టర్లను వారు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రేడ్-2 జెఎల్‌ఎంలకు ఎపిఎస్ఇబి సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డిఎలను విడుదల చేయాలని, ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సూరిబాబు, జెఎసి పోరాట కమిటీ నాయకులు, 327 సంఘం నాయకులు సత్యనారాయణ, 1104 యూనియన్ నాయకులు రెడ్డి శ్రీధర్, లండ శ్రీను, పెంకి ప్రసాద్, ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ నాయకులు బిఎల్ దొర, తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతు సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి-పాలకొండ

ఎపి రైతుసంఘం మన్యం జిల్లా 9వ మహాసభ స్థానిక శ్రీగాయత్రీ ఫంక్షన్ హాల్లో గురువారం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం సీనియర్ నాయకులు కండపు ప్రసాదరావు తెలిపారు. బుధవారం వెలగవాడ పంచాయతీలో రుద్రపేట గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గ గుడి సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు దుర్గగుడి సెంటర్‌కు రైతులు చేరుకోవాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా రైతులు పాల్గొనాలని కోరారు.

245 అంగన్వాడీ భవనాలకు ప్రతిపాదనలు

ఐసిడిఎస్ పీడీ కనకదుర్గ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జిల్లాలో 245 అంగన్వాడీ నూతన భవనాలకు రూ.5 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు ఐసిడిఎస్ పీడీ కనకదుర్గ తెలిపారు. గుమ్మలక్ష్మీపురంలో బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో శిథిలావస్థకు చేరిన అంగన్వాడీ భవనాలను గుర్తించాలని కలెక్టర్ సూచించారని తెలిపారు. ఇందులో భాగంగా 98 పాడైన అంగన్వాడీ భవనాలను గుర్తించినట్లు చెప్పారు. భవనాలు లేని గ్రామాల్లో ధ్రువీకరణ పత్రాలు ఇస్తే నూతన భవనాలు మంజూరుకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. గ్రామకంఠం స్థలాన్ని చూపిస్తే కొత్త భవనం కోసం ప్రతిపాదనలు పెట్టుకోవచ్చని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అద్దె భవనాల నిర్వహణకు రూ.2 వేలు, అర్బన్ ప్రాంతాల్లో రూ.6 వేలు చెల్లిస్తామని చెప్పారు.

108 ప్రోగ్రాం మేనేజర్ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-పాలకొండ

స్థానిక ఏరియా ఆస్పత్రిని 108 ప్రోగ్రాం మేనేజర్ మహమ్మద్ గౌస్ భాషా బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందులో ఉన్న 108 నవజాత శిశు అంబులెన్స్‌ను పరిశీలించారు. అంబులెన్స్‌లో ఉన్న రికార్డులను, పరికరాలను, మందులను నిశితంగా పరిశీలించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ చిరంజీవిని కలిసి, ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా తమ 108 సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజర్ ఎస్.మన్మథనాయుడు, డివిజన్ అధికారి గిరిబాబు, 108 సిబ్బంది గణపతి, శ్రీనివాస్, రమణ, మురళి, అనంతరావు పాల్గొన్నారు.

మద్యం నాణ్యత తనిఖీకి మొబైల్ యాప్

ప్రజాశక్తి - కురుపాం



ఎక్సైజ్ సిఐ శ్రీనివాసరావు

మద్యం నాణ్యత తనిఖీ కోసం మొబైల్ యాప్‌ను ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ప్రవేశపెట్టిందని కురుపాం ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేసిన మద్యమా? కాదా అనేది తెలుసుకోవచ్చన్నారు. ఎపి ఎక్సైజ్ సురక్ష అనే మొబైల్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్‌లో డౌన్లోడ్ చేసుకొని కన్స్యూమర్ అనే టాబ్‌పై ఉంచితే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడానికి వీలవుతుందని చెప్పారు. వినియోగదారులు కొనుగోలు చేసిన మద్యం సీసా మూతపై అతికించిన ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆ సీసా ఎక్కడ తయారైంది? ఏ డిపో నుండి సరఫరా చేశారు? ఏ షాపులో కొనుగోలు చేశారో? వంటి వివరాలు తెలుస్తాయని తెలిపారు. మద్యం సీసాపై గాని, బీరు సీసాపై గాని ఉండే వేరే బార్ కోడ్‌ను స్కాన్ చేయవద్దని చెప్పారు. ఆ బార్ కోడ్ కేవలం లేబుల్‌కి సంబంధించినదని తెలిపారు. మొబైల్ యాప్ లిక్కర్ సీసాకి మాత్రమే వర్తిస్తుందన్నారు. మద్యం నాణ్యతకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే 6302936599 నెంబర్ కు తెలియజేయాలని సూచించారు.

నేడు తాడికొండ జలపాతం ప్రారంభం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం మండలంలోని మొగనాలి (తాడికొండ) జలపాతాన్ని పర్యాటకుల సందర్శన కోసం గురువారం ప్రారంభం కానుంది. కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభోత్సవం చేయనున్నారు. తాడికొండ ప్రాంతం ప్రసిద్ధ పర్యాటక ప్రదేశం. విహారయాత్ర ప్రాంతం కావడంతో పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.



సంతకాల సేకరణలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

బిజెపివి నియంతృత్వ పోకడలు : కాంగ్రెస్

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

బిజెపివి నియంతృత్వ పోకడలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు ధ్వజమెత్తారు. ఓట్ చోర్.. గద్దె చోడ్ కార్యక్రమంలో భాగంగా గుమ్మలక్ష్మీపురంలోని వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ - అమిత్‌షా - రాజేంద్రనాథ్ సమక్షంలో త్రిసభ్య కమిటీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం కులం, మతం పేరుతో విభజించు- పాలించు అజెండాతో ముందుకు సాగుతోందని విమర్శించారు. ఈ వైఖరి ప్రజాస్వామ్య విలువలకు గొడ్డలి పెట్టు వంటిదని ఆందోళన వ్యక్తం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల అధ్యక్షులు మీసాల ఫ్రాన్సిస్, కోలక జయరాం పాల్గొన్నారు.

పిహెచ్‌ఒకు ఎపిఒగా బాధ్యతలు

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేట ఐటిడిఎ అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారిగా పిహెచ్‌ఒ వెంకట గణేష్ బుధవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఎపిఒగా పని చేసిన చినబాబు కొద్దిరోజులు సెలవుపై వెళ్లడంతో ఐటిడిఎ పిహెచ్‌ఒగా విధులు నిర్వహిస్తున్న వెంకట గణేష్‌కు ఎపిఒగా అదనపు బాధ్యతలు అప్పగించారు.



నిరసన తెలుపుతున్న గిరిజనులు

పోడు పట్టాలు ఇవ్వాలని నిరసన

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యాన బుధవారం స్థానిక ఐటిడిఎ వద్ద గిరిజనులు నిరసన తెలిపారు. అనంతరం ఐటిడిఎ ఎపిఒ మురళీధర్‌కు వినతి అందించారు. వీరికి గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పి.సంగం, ఆదివాసి సంఘం నాయకులు కె.జగదీష్, మండంగి సుబ్బన్న, కె.వెంకటరావు, హెచ్.సంధ్య, కద్రక పోలమ్మ పాల్గొన్నారు.

పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి- సీతంపేట

గిరిజన యువతీ యువకులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ప్రాజెక్ట్ ఆర్టికల్చర్ అధికారి ఎస్‌వి గణేష్ అన్నారు. బుధవారం సీతంపేట ఐటిడిఎ పరిధిలో ఉన్న 20 మండలాలు హార్టికల్చర్ అండ్ అగ్రికల్చర్ శాఖల వెలుగు ఎస్‌ఎస్‌సి గ్రూప్ సభ్యులు ఎన్‌జిఒలు సంబంధించి మిద, డిఎ జుగ, ఆర్టికల్ 275 (1) ఎస్‌సిఎ, టిఎస్‌ఎస్ పథకాల యాక్షన్ ప్లాన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గిరిజన యువతీ యువకులు పారిశ్రామికవేత్తలుగా తీర్చి దిద్దడానికి అవసరమైన ప్రతిపాదనలు గ్రామాలలో అవసరమయ్యే పథకాలు కోసం ప్రణాళికల రూపొందించామన్నారు. దీనిలో భాగంగా పుట్టగొడుగుల పెంపకం, పసుపు పంట కోత అనంతరం, పసుపు ఉడకబెట్టి యంత్రాలు సోలార్ డ్రైవర్స్, పసుపు పాలిష్ యంత్రాలు, పసుపు సమగ్ర నిర్వహణ పథకం, ఫారం పాండ్స్, తేనెటీగల పెంపకం వ్యవసాయం యాంత్రీకరణ పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వెలుగు డిపిఎం రమణ, ఎపిఎం కమలకుమారి, వెలుగు అసోసియేషన్ సంజీవరావు, ఆర్ట్స్ ఎన్‌జిఒ సందీప్, విద్య ఫౌండేషన్ హిరమండలం రమేష్ బాబు, సిడబ్ల్యూఎస్ కె రామలక్ష్మి, బ్రెడ్స్ ఫౌండేషన్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

104 జిల్లా మేనేజర్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-సీతానగరం



రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా మేనేజర్ కృష్ణ

సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న 104 వాహనాన్ని జిల్లా మేనేజర్ ఎస్.కృష్ణ అకస్మాత్తుగా తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వాహనంలో ఉండే వైద్య సదుపాయాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. మందులు కొరత లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. వాహనంలో అన్ని రికార్డులు, మందుల లభ్యత పరిశీలించారు. ఈ కార్యక్రమంలో 104 సిబ్బంది ఉన్నారు.

నేడు జిఎస్‌టిపై అవగాహనపై ర్యాలీ

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

సూపర్ జిఎస్‌టి -సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని గురువారం జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు డిపిటిఒ టి.దుర్గా ప్రసాద్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం, సాలూరు, పాలకొండలో మోటారు సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తామని చెప్పారు. పార్వతీపురం బైపాస్ రోడ్డులోని టివిఎస్ షోరూం నుంచి ఉదయం 9 గంటలకు ప్రారంభమై, బెలగాం రైల్వే రోడ్డు జంక్షన్ వరకు ర్యాలీ సాగుతుందని చెప్పారు. ర్యాలీలో జిఎస్‌టి సంస్కరణలో భాగంగా ధరల తగ్గింపు వల్ల వాహనదారులకు, ప్రజలకు కలిగిన ఆర్థిక ప్రయోజనాలపై అవగాహన కలిగిస్తామని పేర్కొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలిక దినోత్సవం

ప్రజాశక్తి - కురుపాం

అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని ఐసిడిఎస్ సిడిపిఒ జి.రజిని దుర్గ బుధవారం కురుపాంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల హక్కులు, బాల్య వివాహాలు, పోక్సో చట్టంపై, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై తీసుకోవలసిన జాగ్రత్తల గూర్చి అవగాహన కల్పించారు. అనంతరం బాలికలకు వ్యాసరచన, ఆటలు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ఎంఇఒ ఎన్.సత్యనారాయణ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి.శంకరరావు, డిసిపిఒ యూనిట్ లీగల్ అధికారులు శ్రీధర్, హరికృష్ణ, ఐసిడిఎస్ సూపర్వైజర్లు జానకమ్మ, రమలక్ష్మి అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం అబ్దుల్ కలాం

గరుగుబిల్లి : భారతరత్న ఎపిజె అబ్దుల్ కలాం యువతకు ఆదర్శమని కొప్పులవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధుసూదనరావు తెలిపారు. బుధవారం మండలంలో నాగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆ మహనీయుని విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-సీతానగరం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు జి.నాగరాజు, డి.రామారావు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలి

మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి- సాలూరు

మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలని మాజీ డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర అన్నారు. మెడికల్ కళాశాలలను ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరణకు వైసిపి అంగీకరించదన్నారు. బుధవారం సాలూరులో తన క్యాంపు కార్యాలయంలో సాలూరు మండల వైసిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో సామాన్యులకు వైద్యం అందుబాటులో అందే విధంగా జిల్లాకు ఒక వైద్య కళాశాలలను ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామని, వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేటీపరం చేస్తే వైసిపి తరఫున తీవ్ర ప్రతిఘటనకు అందరం సిద్ధపడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు వరుస మరణాలతో ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు ఉండడానికే భయపడుతున్నారని ఆశ్రమ పాఠశాలలో ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సమీక్ష నిర్వహించి విద్యార్థులకు అందుతున్న అన్ని రకాల వసతులూ సదుపాయాలను పరిశీలించాలని, సౌకర్యాలు కల్పించే విధంగా ప్రభుత్వం తగు నిర్ణయాలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి గ్రామంలో వైసిపి బూత్ స్థాయి కార్యకర్తలు ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను రచ్చబండ ద్వారా ప్రజలకు తెలియజేయాలని దిశా నిర్దేశం చేశారు. ప్రైవేటు వైద్య కళాశాల ఏర్పాటుకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, జిల్లా వైసిపి మహిళా అధ్యక్షులు రెడ్డి పద్మావతి, వైసిపి కార్యదర్శి దండి శ్రీనివాసరావు, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు .



సాలూరు.. సంతకాల సేకరణ పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర, వైసిపి నాయకులు



పార్వతీపురంటౌన్.. సంతకాలు సేకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

ప్రభుత్వ వైద్య కళాశాలలతోనే మేలు

పార్వతీపురం టౌన్ : ప్రభుత్వ వైద్య కళాశాలలతోనే పేద విద్యార్థులకు మేలు జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం మండలంలోని బాలగూడ గ్రామంలో రచ్చబండ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం తీసుకువచ్చిన మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణ చేయడం దారుణమన్నారు. ప్రయివేటీకరణ చేస్తే పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారని ఆందోళన వ్యక్తంచేశారు. దీన్ని అందరూ వ్యతిరేకించాలని కోరారు. అందుకోసం వైసిపి చేపట్టే సంతకాల సేకరణకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బొమ్మి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోల సత్యనారాయణ, అధికార ప్రతినిధి మువ్వల సత్యం నాయుడు, సర్పంచ్ ప్రతినిధి భూర సూర్యనారాయణ, జెడ్‌పిటిసి ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, వైస్ ఎంపిపిలు సిద్ధా జగన్నాథం, బంకురు రవికుమార్, వైస్ సర్పంచ్ వర్రి శ్రీనివాసరావు, సర్పంచ్ పెండ రమణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యానికి రక్షణ కల్పించాలి

ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్‌ఎంలను నియమించాలి • మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి దీనమయ్య

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్‌ఎంలను నియమించి, విద్యార్థుల ఆరోగ్యానికి రక్షణ కల్పించాలని గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్‌రావు కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఎంపిపి కె.దీనమయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. విద్యాశాఖపై సమీక్ష సందర్భంగా సర్పంచ్ గౌరీశంకరరావు మాట్లాడుతూ విద్యార్థులకు అనారోగ్యం వాటిల్లితే ఫస్ట్ ఎయిడ్ చేసేందుకు స్థానికంగా ఆరోగ్య కార్యకర్తలు లేకపోవడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తీసుకొని వెళ్లాల్సి వస్తుందని అన్నారు. దీంతో విద్యార్థుల చదువుకు ఆటంకంగా ఉందన్నారు. ఇటీవల కాలంలో ఇద్దరు విద్యార్థులకు పచ్చకామెర్లు రావడంతో ముదిరి మరణించారని తెలిపారు. ఆరోగ్య కార్యకర్తల నియామకంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి తొలి సంతకం ఏమైందని ప్రశ్నించారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని, రక్షణ కల్పించాలని కోరారు. ఇరిడి ప్రాథమి పాఠశాలకు పక్కా భవనం లేకపోవడంతో విద్యార్థుల చదువుకు ఆటంకంగా మారిందని చెముడుగూడ ఎంపిటిసి మండంగి రమణ సభ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎంఇఒ చంద్రశేఖర్ మాట్లాడుతూ భవన నిర్మాణానికి వచ్చిన నిధుల మేరకే పనులు చేపట్టామని, పిల్లర్ల స్థాయి వరకు పనులు జరిగాయని తెలిపారు. మరిన్ని నిధుల కోసం ప్రతిపాదనలు పంపించామన్నారు. ప్రస్తుతం విద్యార్థుల చదువుకు ఇబ్బంది లేకుండా రైతు సేవా కేంద్రంలో తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారి పి.శంకర్రావు మాట్లాడుతూ ఇటీవల వర్షాలకు మండలంలో 116 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిలిందని, రైతులకు నష్ట పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపించామని చెప్పారు. క్రిమిసంహారక మందులు, వ్యవసాయ యంత్రాలు కావాలని ఎంపిటిసి రమణ కోరారు. ప్రకృతి వ్యవసాయం పట్ల గిరిజన రైతులకు అవగాహన కల్పించాలని కురుపాం ఎఎంసి చైర్‌పర్సన్ కద్రక కళావతి కోరారు. రైతులకు టార్పాలిన్లు మంజూరు చేయాలన్నారు. అనంతరం ఐసిడిఎస్‌పై జరిగిన సమీక్షలో అంగన్వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు మంజూరు చేయాలని సభ్యులు కోరారు. గ్రామాల్లో పశు వైద్య అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పశువులకు వ్యాధులు సోకి మరణిస్తున్నాయని ఎంపిటిసి రమణ సభ దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో వచ్చిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపాలని ఎంపిపి కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి రాధిక, వైస్ ఎంపిపిలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, ఎంపిడిఒ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

లేఅవుట్ల క్రమబద్ధీకరణతో పంచాయతీలకు ఆదాయం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలో అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ వల్ల పంచాయతీలకు ఆదాయం సమకూరడంతోపాటు ఆక్రమణలు అరికట్టేందుకు వీలు పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ సిహెచ్ శంకర్రావు, ప్లానింగ్ అధికారి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



పాముకాటుకు గురై చికిత్స పొందుతున్న రాము

గ్రీన్ అంబాసిడర్‌కు పాముకాటు

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని చలివేంద్రి సచివాలయ పరిధిలో గ్రీన్‌అంబాసిడర్‌గా పనిచేస్తున్న కూర్మాన రాము పాముకాటుతో అస్వస్థకు గురయ్యాడు. బుధవారం సచివాలయం వెనుక భాగంలో పిచ్చి మొక్కలు రాము తొలగిస్తున్నాడు. ఆ సమయంలో పాము కాటు వేసింది. దీంతో రాము ఒక్కసారి కేకవేయడంతో సమీపంలో ఉన్న వ్యక్తులు వచ్చి వైద్యం కోసం వీరఘట్టం పిహెచ్‌సికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది.

స్మార్ట్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని చల్లంనాయుడు వలస, కోట సీతారాంపురం గ్రామాల్లో బుధవారం స్మార్ట్ రైస్ కార్డులను టిడిపి నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చల్లంనాయుడువలస సర్పంచ్ వి.పారమ్మ, టిడిపి నాయకులు పారు నాయుడు, సిహెచ్ కృష్ణ, కెవి సూర్యనారాయణ, డీలర్ కె మోహన్ రావు, పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న, కోట సీతారాంపురం మాజీ సర్పంచ్ కె.రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి కామేశ్వరరావు పాల్గొన్నారు.

వెదురు మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలో హెచ్‌ఎన్‌టి ఫారం వద్ద ఎపిఎం కమల కుమారి ఆధ్వర్యంలో బుధవారం గిరిజన రైతులకు వెదురు మొక్కలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఒక రైతుకి 60 మొక్కలు చొప్పున మొత్తం మండలంలోని 256 మంది రైతులకు మొక్కలను అందించారు. రైతుకు జీవనోపాధి కల్పించడానికి వెదురు సాగు బాగా ఉపయోగపడుతుందన్నారు. దీనిని రైతులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎ చక్రపాణి, సీసీలు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

దోమపోటు పట్ల జాగ్రత్త



పాచిపెంట.. రైతులతో మాట్లాడుతున్న ఎఒ తిరుపతిరావు

ప్రజాశక్తి-పాచిపెంట

వరిలో దోమపోటు, ఆకుఎండు, పాము పొడ తెగులు ఆశించాయని, వీటి నివారణకు తగు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని చెరుకుపల్లి, పనుకువలసలో వరి పొలాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమపోటును పిల్ల పురుగులు దశలోనే నివారించుకోవాలని సూచించారు. వందల సంఖ్యలో గుడ్లు పెట్టడం వల్ల ఉధృతి పెరిగితే నివారణ చాలా కష్టమని చెప్పారు. పొట్ట కుళ్ల తెగులు, పాముపొడ తెగులు.. దోమ పోటుతో కలిసి ఉండడం వల్ల పొట్ట నుంచి వెన్ను సరిగ్గా బయటకు రాకుండా తాలుగింజలు ఎక్కువగా ఉండి దిగుబడి బాగా తగ్గుతుందని తెలిపారు. వీటి నివారణకు డైనోటో ఫిరాన్ 250 గ్రాములు, అజాక్సీ స్ట్రోబిన్ 200 మిల్లీ లీటర్ల కలిపి చేను బాగా తడిచేటట్టు పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఇఒ నాగమణి, విఎఎ లావణ్య పాల్గొన్నారు.

వరిపొలాలు పరిశీలన

కురుపాం : కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు అనంత విహారి, స్రవంతి బుధవారం జియ్యమ్మవలస మండలంలో పెదమేరంగి గ్రామంలో వరి పొలాలను పరిశీలించారు. ఈ ప్రాంతంలో సుడిదోమ తాకిడి వరి పొలాలకు ఎక్కువగా ఉందని గుర్తించి, నివారణపై రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



కురుపాం.. వరి పొలాలను సందర్శిస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

జీడి యాజమాన్య పద్ధతులపై అవగాహన

మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో హార్టికల్చర్ శాస్త్రవేత్త ఎస్.శ్రీనివాసరాజు బుధవారం రైతులకు జీడి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడి కొమ్మలు దగ్గరగా ఉన్న వాటిని కత్తిరించి, పునరుద్ధరణ చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. జీడి తోటలో అంతర పంటలుగా పైనాపిల్, పసుపు సాగువల్ల కొంత ఆదాయం పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

చేతుల శుభ్రంతో ఆరోగ్యానికి రక్ష

ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



గుమ్మలక్ష్మీపురం.. పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గ్లోబల్ హ్యాండ్‌వాష్‌తో ప్రజల ఆరోగ్యానికి రక్షణ ఉంటుందని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం గ్లోబల్ హ్యాండ్ వాష్ డే పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. వంట చేసిన తర్వాత, ఆహారం తినే ముందు చేతులను సబ్బుతో కడుక్కుంటే క్రిములను దూరం చేయవచ్చన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే సూక్తితో ప్రతిఒక్కరూ మూడు పూటలా చేతులను శుభ్రం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ కనకదుర్గ, భద్రగిరి సిడిపిఒ విజయగౌరీ, సూపర్‌వైజర్ గౌరమ్మ, విజయవాహిని చారిటబుల్ ట్రస్ట్ జిల్లా అధికారి సుబ్రమణ్యం, మండల అధ్యక్షులు అడ్డాకుల నరేష్, బిజెపి ఎస్‌టి మోర్చా జిల్లా అధ్యక్షులు నిమ్మక సింహాచలం, నాయకులు మండంగి ప్రసాద్, సొంటేనా రాజేష్, మహేశ్వర చిన్న, గౌడు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : గంగరేగువలస అంగన్వాడీ కేంద్రంలో గ్లోబల్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా ఐసిడిఎస్ కొమరాడ ప్రాజెక్ట్ అధికారి జి.సుగుణ కుమారి ప్రజలకు పరిశుభ్రత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ శారదాంబ, ఆదిలక్ష్మి, బంగారమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కొమరాడ.. చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ అధికారులు



కషాయాల తయారీపై శిక్షణ ఇస్తున్న ఆర్‌వైఎస్‌ఎస్ ప్రతినిధి రమాప్రభ

కషాయాల తయారీపై శిక్షణ

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలోని మిర్తివలస గ్రామంలో ఆర్‌వైఎస్‌ఎస్ కన్సల్టెంట్ కె.రమాప్రభ ఆధ్వర్యాన బయో రిసోర్స్ సెంటర్ల ప్రతినిధులకు కషాయాల తయారీపై బుధవారం శిక్షణ ఇచ్చారు. 12 రకాల కషాయాల తయారీ, ఉపయోగాల గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ శంబంగి శ్రీనివాస్, ఎన్‌ఎఫ్ఎ జి.అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి

ప్రజాశక్తి-కొమరాడ

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రవేశపెట్టిన ఉల్లాస్ పథకాన్ని క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేయాలని ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ శిక్షణ తరగతులను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ, జెడ్‌పిటిసి సభ్యులు ద్వారపురెడ్డి లక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో నిరక్షరాస్యులను గుర్తించి ఉల్లాస్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం సురేష్ బాబు, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది సన్ని బాబు, తదితరులు ఉన్నారు.

సీతానగరం : ఉల్లాస్ అక్షర ఆంధ్ర లక్ష్యాలను నెరవేర్చాలని ఎంపిడిఒ ఎంఎల్‌ఎన్ ప్రసాద్, వెలుగు ఎపిఎం భారతి విద్యావాలంటీర్లకు సూచించారు. 240 మంది వాలంటీర్లకు వెలుగు, ఎంపిడిఒ కార్యాలయాల్లో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఎపిఒ బాలకృష్ణ, వెలుగు సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

వీరఘట్టం : నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ విద్యా వాలంటీర్లను ఆదేశించారు. బుధవారం స్థానిక వెలుగు, ఎంపిడిఒ కార్యాలయాల్లో ఉల్లాస్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసి లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఎపిఎం కె.రాము, ఉపాధి హామీ ఎపిఒ జి.సత్యంనాయుడు, వాలంటీర్లు పాల్గొన్నారు.



డివైడర్లకు రంగులు వేస్తున్న కార్మికులు

ఎట్టకేలకు డివైడర్లకు రంగులు

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టంలోని ప్రధాన రహదారికి మధ్యలో ఉన్న డివైడర్లకు ఎట్టకేలకు రంగులు వేస్తున్నారు. ప్రధాన రహదారి విస్తరణ పనులు జరిగి దాదాపుగా రెండేళ్లు కావస్తున్నా, డివైడర్లకు ఎటువంటి రంగులు వేయలేదు. దీంతో డివైడర్లు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకున్నాయని, డివైడర్లకు రంగులు వేయడంతో కొంతమేర వాహన ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు.